సాక్షి కామారెడ్డి
సోమవారం । 26 । జూన్ । 2023



వీవోఏ ఇంటికి తాళం

అక్రమాలకు పాల్పడిన నందివాడ వీవోఏ ఇంటికి మహిళా సంఘాల సభ్యులు తాళం వేసి నిరసన తెలిపారు.

- 8లో ▸



వానొస్తే బడి బంద్

విఠల్‌వాడి ప్రభుత్వ పాఠశాల భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయంభయంగా గడుపుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /22.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

తాత్కాలిక అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన బోధన సిబ్బందిని నియమించనున్నారు. ఇందుకోసం ఈనెల 30న ఉదయం 10 గంటల నుంచి ఎల్లారెడ్డి కళాశాలలో డెమో తరగతులు నిర్వహించనున్నట్లు గురుకుల సంస్థ ఆర్‌సీవో ఏసుపాదం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 జూనియర్ లెక్చరర్లు, 7 పీజీటీ, 9 టీజీటీ, రెండు పీఈటీ, రెండు అసిస్టెంట్ కేర్‌టేకర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైనవారు సోమవారం సాయంత్రం 5గంటలలోపు ఎల్లారెడ్డి లేదా ధర్మారం కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముదిరాజ్‌లకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

కామారెడ్డి టౌన్: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముదిరాజ్‌ల మనోభావాలను దెబ్బతీసిన కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి అనర్హుడని పేర్కొన్నారు. ఓ చానల్ రిపోర్టర్‌ను కిడ్నాప్ చేసి గదిలో బంధించి చిత్రహింసలు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి కౌశిక్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో ముదిరాజులతో కలిసి కాంగ్రెస్ పార్టీ బీఆర్ ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

‘ఉద్యోగులపై వివక్ష వీడాలి’




కామారెడ్డి టౌన్: ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్షను వీడాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ ప్రకటించాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ విభాగ్ ప్రభారి వెంకట్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్ : పాలిటెక్నిక్ కళాశాలలో ఎంసెట్ ఎంపీసీ విభాగంలో ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శ్రీరాంకుమార్ ఆదివారం తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఈ నెల 26 నుంచి స్లాట్ బుకింగ్ జూలై 5 తేది వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈనెల 28 తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం కోర్సుల ఎంపిక ఉంటుందన్నారు. జూలై 12 తేదీన సీట్లు కేటాయించనున్నామన్నారు.

ప్రతి ఇంటి కథే ‘ఇంటింటి రామాయణం’



నిజామాబాద్ సిటీ : ఇటీవల విడుదలైన ఇంటింటి రామాయణం ప్రతి ఇంట్లో జరిగే కథను తీసుకుని నిర్మించిన చిత్రమని, ప్రేక్షకులు ఆదరించాలని చిత్ర దర్శకుడు సురేష్ నారెడ్ల కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వేణు మాల్‌లో చిత్ర యూనిట్ సందడి చేసింది. దర్శకుడు మాట్లాడుతూ ఇంటింటి రామాయణం సినిమా ఆహాలో రిలీజ్ అయ్యిందన్నారు. త్వరలో స్క్రీన్‌పై విడుదల కానుందన్నారు. కార్యక్రమంలో సినిమాలో నటించిన బాలుడు, అంజి మామ, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 553 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు (90 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1,064.90 అడుగుల(20.06 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

రైతుబంధుకు వేళాయె!

- నేటినుంచి అన్నదాతల ఖాతాల్లోకి నిధులు
- జిల్లాలో 3,05,994 మందికి లబ్ధి



కామారెడ్డి క్రైం: వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతుబంధు పంపిణీకి వేళయ్యింది. సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. పంటల సాగులో రైతులకు ఆర్థికంగా చేయూతను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2018లో రైతుబంధు పథకాన్ని తీసుకువచ్చింది. మొదట్లో ఎకరానికి రూ. 4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించేవారు. ఏడాది తర్వాత ఈ సాయాన్ని ప్రభుత్వం రూ.5 వేలకు పెంచింది. ప్రతి ఖరీఫ్, రబీ సీజన్లలో ఎకరాకు రూ. 5 వేల చొప్పున రైతులకు సాయం అందుతోంది.

ఊరట..

వానాకాలం సీజన్ ప్రారంభమైంది. వర్షాల రాక అలస్యమైనా.. ఇప్పటికే పలు ప్రాంతాలలో సాగు పనులు మొదలుపెట్టారు. కొన్నిచోట్ల మొక్కజొన్న, సోయాబీన్ పంటలు వేస్తున్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే పనిలో ఉన్నారు. చాలాచోట్ల రైతులు పత్తిలాంటి పంటలు వేసి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పటిలాగే కామారెడ్డి జిల్లాలో వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుందని భావిస్తున్నారు. దాదాపు రెండున్నర లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. రైతులు వరి సాగు కోసం కసరత్తు మొదలుపెట్టారు. రైతుబంధు సాయం ఆలస్యం కావడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఎట్టకేలకు సర్కారు పెట్టుబడి సాయం విడుదల చేస్తుండడంతో రైతులు ఊరట చెందుతున్నారు. రైతుబంధు నిధులు అందితే ఎంతోకొంత ఆసరాగా ఉంటుందని పేర్కొంటున్నారు.

పెరగనున్న లబ్ధిదారులు..

జిల్లాలో గత యాసంగి సీజన్‌లో 2.75 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందింది. రూ. 260.39 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. కాగా సాంకేతిక సమస్యల కారణంగా 6,885 మంది రైతులకు డబ్బులు జమ కాలేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. కొత్త రైతుల నమోదు, పెండింగ్‌లో ఉన్న రైతు ఖాతాల బ్యాంకు అకౌంట్‌ల సేకరణ, అటవీ భూములపై హక్కులు ఉన్న రైతులలాంటి వివరాలను వెంటనే అప్‌డేట్ చేసి ప్రతి ఒక్కరికీ రైతుబంధు అందేలా చూడాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో రైతుబంధు లబ్ధిదారుల తుది జాబితాను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో 21,277 మంది కొత్త రైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరో 2,480 మంది రైతులు చనిపోగా వారి ఖాతాలను నిలిపివేశారు. ఈ ఖరీఫ్‌లో 3,05,994 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని అధికారులు తెలిపారు. దీనికి దాదాపు రూ. 280 కోట్ల నిధులు అవసరం కావచ్చని అంచనా వేశారు. ముందుగా ఎకరం భూమి కలిగిన రైతులకు పెట్టుబడి సాయం అందించనున్నారు. ఆ తర్వాత విస్తీర్ణం ప్రకారం తక్కువ నుంచి ఎక్కువ భూమి కలిగిన రైతులకు సాయం అందనుంది.

అందరికీ అందేలా చూస్తాం



గతంలో బ్యాంకు అకౌంట్ వివరాలు సమర్పించని రైతులు, కొత్త రైతులు తమ వివరాలను స్థానికంగా ఉండే వ్యవసాయ అధికారులకు అందజేయాలి. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలి. వెంటనే పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికి రైతుబంధు సాయం అందేలా చూస్తాం.

–వీరస్వామి, ఇన్‌చార్జి డీఏవో, కామారెడ్డి

రెండో విడతకు కసరత్తు!



- ఒక్కో నియోజకవర్గంలో 1,100 మందికి దళితబంధు అవకాశం
- కలెక్టర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ

సాక్షి, కామారెడ్డి: దళిత కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం రెండో విడత కోసం కసరత్తు మొదలైంది. ఒక్కో నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దళితబంధు పథకం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన నిజాంసాగర్ మండలంలో గతేడాది 1,298 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. అలాగే ఒక్కో నియోజకవర్గంలో వంద కుటుంబాల చొప్పున 350 కుటుంబాలకు ప్రయోజనం కల్పించారు. మొత్తంగా 1,648 కుటుంబాలు లబ్ధిపొందాయి. రెండో విడతలో ఒక్కో నియోజకవర్గంలో 1,100 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో 1,100 చొప్పున 3,300 మందిని, బాన్సువాడ నియోజకవర్గంలో 550 మందిని ఎంపిక చేయనున్నారు.

ప్రతి దళిత కుటుంబానికి సాయం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. విడతల వారీగా యూనిట్లు మంజూరు చేసి అందరికీ అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కలెక్టర్ల ఆధ్వర్యంలో జరగనుంది. నియోజకవర్గాల వారీగా దళిత కుటుంబాల జాబితాలను రూపొందించి అధికారుల ద్వారా పరిశీలించిన అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. మొదటి విడతలో పాటించిన మార్గదర్శకాలనే ఈసారీ పాటించనున్నారు.

దళిత కుటుంబాల్లో ఆశలు

ప్రభుత్వం రెండో విడత దళితబంధు అమలుకు ఆదేశాలు జారీ చేయడంతో దళిత కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. మొదటి విడతలో నియోజకవర్గానికి వంద మందికే అవకాశం ఇవ్వడంతో చాలా మంది నిరాశ చెందారు. ఈసారి ఒక్కో నియోజకవర్గంలో 1,100 మందికి ప్రయోజనం కలగనుంది. దీంతో ఆయా గ్రామాల్లో దళితులు దళితబంధు యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. కాగా దళితబంధు యూనిట్ల విషయంలో కొన్నిచోట్ల దళారులు లబ్ధిదారుల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా పకడ్బందీగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని దళితులు కోరుతున్నారు.



కమల వికాసం

నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూరు చెరువులో కనువిందు చేస్తున్న కమలం పూలు

నిజామాబాద్ రూరల్ మండలం కాలూరు చెరువులో కమలం పూలు కనువిందు చేస్తున్నాయి. రోడ్డు పక్కన గల చెరువులో వికసించిన ఈ పూలు వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. విరివిగా వికసించిన కమలాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

మద్నూర్: మండల కేంద్రంలో ఆదివారం పిచ్చి కుక్క దాడి చేసిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు ఆరేళ్ల చిన్నారులు ఉన్నారు. మండల కేంద్రానికి చెందిన ఆరేళ్ల అవార్‌వార్ అమ్ములు, సబ్బిన్‌వార్ మణికంఠ ఆదివారం తమ ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో పిచ్చికుక్క వారిపై దాడి చేసింది. అమ్ములు అనే బాలిక ముఖంపై కరిచింది. కుక్క దాడిలో ఆమె పెదవికి గాయమైంది.

అనంతరం మణికంఠ అనే బాలుడి చేతిపైనా కుక్క కాటు వేసింది. గజ్జెల్‌వార్ సంజీవ్, ఎస్‌కే బాబు, హన్మండ్లుపైనా దాడి చేసి గాయపరిచింది. బాధితులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మణికంఠ, అమ్ములు, సంజీవ్‌లను నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాబు, హన్మండ్లు మహారాష్ట్రలోని దెగ్లూర్ ఆస్పత్రికి వెళ్లారు.



గాయపడిన అమ్ములు, సంజీవ్

గ్రామస్తుల ఆగ్రహం

మద్నూర్‌లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని దీంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఫిబ్రవరిలో సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విఠల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్‌లకు వినతి పత్రం అందించారు. అయినా సమస్యకు పరిష్కారం చూపలేదని పంచాయతీ పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహా సరిహద్దుల్లో వేట

- వన్య ప్రాణులకు ఉచ్చు బిగిస్తున్న వేటగాళ్లు
- బోధన్ మండలం ఖండ్‌గాం చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన ముఠా
- అక్రమంగా తరలిస్తున్న 18 ముళ్ల పందులు స్వాధీనం
- ఫారెస్టు అధికారులకు అప్పగించిన పోలీసులు



ముళ్ల పందులను తరలిస్తున్న ముఠాను పట్టుకున్న పోలీసులు



సంచుల్లో తరలిస్తున్న ముళ్ల పంది

బోధన్/డొంకేశ్వర్ : జిల్లాకు ఆనుకుని ఉన్న మహారాష్ట్ర సరిహద్దుల్లో వన్య ప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. మంజీర, గోదావరి తీరాలను అడ్డగా చేసుకుని వేటగాళ్లు తమ వేటను కొనసాగిస్తున్నారు. రెండు నెలల క్రితం బోధన్‌లో రియాజ్ పాషా వద్ద జింక చర్మం, కొమ్ములతో పాటు ఒక నాటు తుపాకీ, నెమలి ఈకలను ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ముళ్ల పందులను గోనె సంచుల్లో కుక్కి వాహనంలో తీసుకెళ్తున్న ముఠాను ఆదివారం బోధన్ మండలం ఖండ్‌గాం చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇది ఫారెస్టు అధికారుల నిఘా వైఫల్యానికి నిదర్శనమని చెప్పవచ్చు. అయితే, వేటగాళ్లు ఎక్కడి నుంచో వచ్చి అధికారుల కంట పడకుండా మంజీర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో అటవీ జంతువులను వేటాడి అడ్డదారుల్లో అక్రమంగా తరలిస్తున్నారు. వీటి మాంసాన్ని మాంస ప్రియులకు, దాబాలు, హోటళ్లలో ఎక్కువ ధరకు విక్రయిన్నారు. స్థానిక పోలీసులు, ఫారెస్టు అధికారులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఖండ్‌గాం చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో మహారాష్ట్ర నుంచి బోధన్ వైపు వస్తున్న టీఎస్ 03 ఎఫ్‌ఏ 0787 (సుజుకి ఈకో) వాహనాన్ని పోలీసులు ఆపారు. పోలీసులను చూసిన డ్రైవర్ దేవరాజుల జంపయ్య పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతడిని చాకచక్యంగా పట్టుకున్నారు. డ్రైవర్‌తో ఉన్న మరో వ్యక్తి శివకృష్ణను కూడా పట్టుకున్నారు. వీరిని విచారించగా వ్యాన్‌లో ముళ్లపందులున్నాయని తెలిపారు. పోలీసులు వ్యాన్‌ను పరిశీలించిన సందర్భంగా గోనె సంచుల్లో కుక్కి అక్రమంగా తరలిస్తున్న 18 ముళ్ల పందులను గుర్తించారు. పోలీసులు వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. నిందితులిద్దరు హన్మకొండకు చెందిన వ్యక్తులు. అటవీ జంతువులను ఎక్కడ వేటాడి, ఎక్కడికి తరలిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. బిలోలి అవతల గల పాట అనే గ్రామం వద్ద ఉత్తమ్, ప్రకాశ్‌లకు విక్రయిస్తామని, వీటిని హన్మకొండలో అమ్ముతారని వేటగాళ్లు వెల్లడించారు. అయితే, వేట జరిగే ప్రాంతాలు, అటవీ జంతువులను, వాటి మాంసాన్ని విక్రయించే స్థలాలపై అటవీ అధికారులు ఆరా తీస్తున్నారు. ముఠాలో ఇంకెవరైనా వ్యక్తులున్నారనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు.

పట్టుబడిన వ్యక్తులతో పాటు వాహనాన్ని పోలీసులు ఫారెస్టు అధికారులకు అప్పగించారు. వేటగాళ్లను, చనిపోయిన ముళ్ల పందులను సోమవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చనున్నారు. వాహనాన్ని, వేటగాళ్లను పట్టుకున్న పోలీస్ కానిస్టేబుల్ మహిపాల్, హోంగార్డు విఠల్‌ను ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారు.

అంగన్‌వాడీల్లో అందని పౌష్టికాహారం

- సరఫరా కాని సరుకులు
- టీచర్లకు తప్పని తిప్పలు

నిజాంసాగర్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా కాకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందని ద్రాక్షగా మారుతోంది. కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు భోజనం అందించడానికి అంగన్‌వాడీ టీచర్లు తిప్పలు పడుతున్నారు.

జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,193 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటి పరిధిలో 7,661 మంది గర్భిణులు, 64,714 మంది చిన్నారులు ఉన్నారు. మాతాశిశు మరణాల నివారణ, చిన్నారుల్లో పోషణ లోప సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం పోషకాహారాన్ని అందిస్తోంది. ఆరోగ్య లక్ష్మి పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు అన్నం, పప్పు, కూరగాయలు, గుడ్లు, పాలతో కూడిన పోషకాహారాన్ని ఇవ్వాల్సి ఉంది. అయితే కేంద్రాలకు సక్రమంగా సరుకులు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలన్నరనుంచి పప్పులు సరఫరా కావడం లేదు. కొన్ని చోట్ల పాలు, కోడిగుడ్లు అందించడం లేదు.



భోజనం చేస్తున్న చిన్నారులు(ఫైల్)

నాలుగు నెలలనుంచి మురుకులు రావడం లేదు. ఓవైపు పప్పు రాకపోవడం, మరోవైపు కూరగాయల ధరలు గణనీయంగా పెరగడంతో వంట చేయడానికి అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందిపడుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించి, సరుకులు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ భోజనం అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. మురుకులు, పప్పు కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, నిజాంసాగర్

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

- దెబ్బతిన్న జొన్నలను కొనుగోలు చేస్తాం
- మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

పిట్లం: రైతులు పండించిన జొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో వర్షాలతో దెబ్బతిన్న జొన్నలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పిట్లం మండలంలో దెబ్బతిన్న జొన్న పంటను కొనుగోలు చేయడం లేదని రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీంతో తాను పిట్లం వచ్చి జొన్నలను పరిశీలించానన్నారు. దెబ్బతిన్న, రంగు మారిన జొన్నలనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. దెబ్బతిన్న పంటకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపామని, కొనుగోళ్లకు సంబంధించి రెండు రోజులలో అనుమతి లభించవచ్చని పేర్కొన్నారు. అనుమతి రాగానే బీ గ్రేడ్ ధరకు జొన్నలను కొనుగోలు చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ శపథం రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార గంగారెడ్డి

క్లుప్తంగా

‘తెయూ పాలకమండలి రద్దుపై అనుమానాలు’

మోపాల్: తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన అక్రమాలు, అన్యాయాలకు పరిష్కారం దొరికిందనుకునే సమయంలో పాలకమండలి రద్దు అంశం తెరపైకి రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందని, దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఆదివారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఎస్‌ఏ, ఎంఎస్‌ఎఫ్, భీమ్ ఆర్మీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడారు. ఫిబ్రవరి 27న రద్దయిన పాలకమండలి ఏడు సార్లు ఏ విధంగా సమావేశమైందని ప్రశ్నించారు. ఆ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు నమ్మొచ్చని పేర్కొన్నారు. రద్దయిన పాలకమండలి సమావేశాల పేరుతో రూ.16వేల చొప్పున ఇప్పటివరకూ రూ.10లక్షల వరకు యూనివర్సిటీ నిధులు దుర్వినియోగం చేశారని, ఆ నిధులు తిరిగి చెల్లించాలని డిమాండ్‌చేశారు. వారంరోజుల్లోగా అనుమానాలను నివృత్తి చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు నిఖిల్, దినేష్, సురేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



బోధన్‌టౌన్: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. బోధన్ డివిజన్‌లో 5 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తున్నారని గోసంరక్షకులకు తెలిస్తే వారు వెళ్లకుండా పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రాజ్, గోరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు



తాడ్వాయి: తాడ్వాయి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వంగి వైర్లు కిందకు వేలాడుతున్నా ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించడం లేదు. తాడ్వాయి శివారులోని పంట పొలాల్లో వైర్లు చేతికి అందే పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆరోపించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సిరికొండ: ఆటో డ్రైవర్లు తమ వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై నర్సింలు సూచించారు. మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆయన ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. ఆటోలలో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోవద్దన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని, ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ మధుకర్, కానిస్టేబుల్ శంకర్, హోంగార్డు గోవింద్, ఆటోవాలాలు పాల్గొన్నారు.

ఆదర్శం.. పాల శీతల కేంద్రం

- ఎర్రాపహాడ్ కేంద్రంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పాల సేకరణ
- ఆర్థికంగా ఎదుగుతున్న రెండు వేల మంది రైతులు



పాలను కూల్ చేసే మిషన్



ఎర్రాపహాడ్‌లోని పాలశీతలీకరణ కేంద్రం

తాడ్వాయి: తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో గల పాలశీతల కేంద్రం రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తుంది. రోజురోజుకు పాల ఉత్పత్తిని పెంచడమే కాకుండా లాభాల బాటలో నడుస్తుంది. గతంలో ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన రైతులు డబ్బులను పోగు చేసి భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిని విజయ డెయిరీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో పాల శీతల కేంద్రం కోసం నూతన భవనాన్ని నిర్మించారు. 2007 జూలైలో 475లీటర్లతో డెయిరీని ప్రారంభించారు. మండలంలోని ఎర్రాపహాడ్, దేమికలాన్, కన్‌కల్, కరడ్‌పల్లి, నందివాడ, ఎండ్రియాల్, లింగంపేట్ మండలంలోని మోతే, ముస్తాపూర్, లింగంపల్లి గ్రామాలకు చెందిన విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల నుంచి పాలను సేకరించారు. సేకరించిన పాలను కూల్ చేసి కామారెడ్డిలోని పాత రాజంపేట్, హైదరాబాద్‌లోని డెయిరీలకు పంపిస్తారు. డెయిరీ పరిధిలో సుమారు ఐదు వేల మంది రైతులు పాలు పోశారు.

రైతులకు అండగా..

కేంద్రంలో పాల సేకరణ రెండేళ్లలో తొమ్మిది వేల లీటర్లకు పెరిగింది. దీంతో లాభాలు రావడంతో రైతులకు లీటరుకు రూ.1.50పైసల చొప్పున అదనంగా చెల్లించారు. అలాగే రూ.4.50 లక్షలతో చాఫ్ కటర్లను కొనుగోలు చేసి 8 గ్రామాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు పంపిణీ చేశారు. ఉదయం, సాయంత్రం నాణ్యమైన పాలను సేకరించడంతో మరింత లాభాలు రావడంతో డెయిరీ ఆవరణలో మరోరెండు అదనపు భవనాలు, ప్రహరీ నిర్మించారు. పాల ఉత్పత్తి దారుల సహకార సంఘాలకు దాన సంచులు, గడ్డి విత్తనాలను సరఫరా కోసం ట్రాన్స్‌పోర్టు చార్జీలను డెయిరీ భరిస్తోంది. 2014లో అప్పటి వ్యవసాయశాఖమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆ రెండు భవనాలను ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు బిల్లుతో పాటు లీటరుకు అదనంగా రూ.4 ప్రోత్సాహకంగా ఇచ్చింది. దీంతో రైతులు పాడి పశువులను కొనుగోలు చేసుకొని పాలఉత్పత్తిని పెంచుకున్నారు. 2020 నుంచి రైతులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం అందడం లేదు. దీంతో పాల ఉత్పత్తిపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం బీఎంసీ(బల్క్ మిల్క్ సెంటర్)కి రెండు వేల మంది రైతుల నుంచి 5వేల లీటర్ల పాలు వస్తున్నాయి. డెయిరీ నుంచి ఏపిబిన్ గడ్డిని ఉచితంగా రైతులకు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం పాలశీతల కేంద్రంలో రూ.25 లక్షలు నిలువ ఉన్నాయి.



పాల క్యానులు

సబ్సిడీపై మిషన్లను ఇవ్వాలి



పాలు పోసే రైతులకు 50శాతం సబ్సిడిపై మిల్కు మిషన్‌ను సరఫరా చేయాలి. దీంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. 50శాతం సబ్సిడీపై చాఫ్ కటర్‌లను సరఫరా చేయాలి. రైతుల కు అందుబాటులో ఉండి మరింత పాల అభివృద్ధి చెందేలా కృషి చేస్తాను.

– నరసింహారెడ్డి, బీఎంసీ చైర్మన్

నాణ్యమైన పాలు సేకరిస్తున్నాం



రైతుల నుంచి నాణ్యమైన పాలను సేకరిస్తున్నాం. తరుచుగా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను సందర్శించి రైతులకు పాలఉత్పత్తిపై అవగాహన కల్పిస్తున్నాం. అధికంగా పాలు పోసిన రైతులకు ప్రోత్సాహక బహుమతులను కూడా ఇస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, బీఎంసీ మేనేజర్

పశువులకు ఇన్సూరెన్స్ చేయించాలి



పాడి పశువులకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయించాలి. పాలు పితికే మిషన్‌లు కూడా సరఫరా చేయాలి. ఉచితంగా గడ్డి విత్తనాలను సరఫరా చేయాలి. ఏడాదికి 34 వేల లీటర్ల పాలు పోస్తున్నాను. ఎంతో లభం వస్తుంది.

– ప్రతాప్, రైతు, ఎర్రాపహాడ్

వీవోఏ ఇంటికి తాళం వేసిన మహిళలు

తాడ్వాయి: మండలంలోని నందివాడ గ్రామంలో అవినీతికి పాల్పడిన వీవోఏ బాబాగౌడ్ ఇంటికి ఆదివారం మహిళా సంఘాల సభ్యులు తాళం వేశారు. గ్రామానికి చెందిన 21 గ్రూపులకు సంబంధించిన డబ్బులను అదే గ్రామానికి చెందిన వీవోఏ బాబాగౌడ్ కాజేసిన విషయం తెలిసిందే. రూ.36లక్షలకు పైగా స్వాహా చేసిన బాబాగౌడ్ నుంచి తమకు డబ్బులను ఇప్పించాలని కలెక్టర్, అధికారులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం, బాబాగౌడ్‌కు ఫోన్ చేసిన స్పందించక పోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు బాబాగౌడ్ ఇంటి ముందు వంట వార్పులు చేసుకుంటూ నిరసన తెలిపిన ఎవరు స్పందించడం లేదన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన మహిళలు బాబాగౌడ్ కుటుంభ సభ్యులను ఇంటి నుంచి బయటకు పంపించారు. అనంతరం ఇంటికి తాళం వేసి, ఇంటిని మహిళా సంఘం కార్యాలయంగా వాడుకుంటామని తెలిపారు. అలాగే ఇంటి ముందు గేటుకు మహిళా సంఘం కార్యాలయం అని బోర్డును తగిలించారు. అధికారులు గ్రామంలోకి వచ్చి బాబాగౌడ్ నుంచి తమకు రావల్సిన రూ.36లక్షలు ఇప్పించే వరకు ధర్నా కొనసాగిస్తామన్నారు.



బాబాగౌడ్ ఇంటికి తాళం వేసిన దృశ్యం



గేటుకు ఏర్పాటు చేసిన బోర్డు

ప్రపంచాన్ని మార్చే శక్తి యువతకే ఉంది



మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేస్తున్నాయని, ప్రపంచాన్ని మార్చే శక్తి యువతకే ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. కోటగల్లీలోని ఎన్‌ఆర్ భవన్‌లో ఆదివారం పీవైఎల్ 8వ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. ఉద్యోగ నియమాకాల్లో కూడా అక్రమాలు జరుగుతున్నాయన్నారు. పీవైఎల్ యువతను ఏకం చేసి యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలన్నారు. అంతకు ముందు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సుంకరి రవి జెండాను ఆవిష్కరించారు. నాయకులు దాసు, నీలం సాయిబాబా, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయరెడ్డి, వనమల సత్యం, నర్సయ్య, శ్రీనివాస్, వెంకటేష్, సాయినాథ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం

సుభాష్‌నగర్: దేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎమర్జెన్సీ డే సందర్భంగా ఆనాడు పోరాడి జైలుకెళ్లిన వారిని సన్మానించారు. వారు మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగాన్ని కాలరాస్తూ 1975 జూన్ 25న ఇందిరి గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీని విధించిందని గుర్తు చేశారు. ఈ చీకటి దినానికి 45 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. ఎమర్జెన్సీ విధించిన వెంటనే ప్రతిపక్ష నాయకులు వాజ్‌పేయి, అద్వానీ, మొరార్జీ దేశాయ్ వంటి నేతలను వారెంట్ లేకుండా అరెస్టులు చేశారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాసిన జర్నలిస్టులను సైతం జైళ్లల్లో వేశారన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను రద్దు చేశారని, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ హరించడం వంటి నియంత పాలనలో దాదాపు రెండేళ్లపాటు ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. పుప్పాల రాజేందర్, ఒలిసెల రాజేశ్వర్, బూసణి గోవర్ధన్, రమేష్‌బాబు, జలగం వెంకట్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, చిలివేరి శ్రీధర్, పోల ఆంజనేయులు, ద్యాగ శంకర్, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దినేష్ కులాచారి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, నాయకులు నాగోల్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి లింగం, పద్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పంచరెడ్డి శ్రీధర్, ప్రభాకర్, వీరేందర్ పాల్గొన్నారు.



ఎమర్జెన్సీ సమయంలో జైలుకెళ్లిన వారిని సన్మానిస్తున్న నాయకులు

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

నిజామాబాద్‌నాగారం: ప్రస్తుతం దేశంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తుందని వక్తలు అన్నారు. ఆదివారం ప్రజాపంథా ఆధ్వర్యంలో దేశంలో ఎమర్జెన్సీ విధించిన రోజు సందర్భంగా నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు పౌరహక్కుల రాష్ట్ర కోశాధికారి అట్లోట్ రవీందర్ సహా 152 మందిపై పెట్టిన ఉపా కేసును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఉపా చట్టాన్ని శాశ్వతంగా రద్దు చేయాలన్నారు. 1975లో ఇదే రోజు ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించి 21 నెలలు కొనసాగిస్తే, మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తుందన్నారు. కేసీఆర్ సర్కారు మోదీ నిరంకుశత్వంలో అడుగులు వేస్తోందని ఆరోపించారు. ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, నగర కార్యదర్శి సుధాకర్, జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు నర్రా రామారావు, నాగేశ్వరరావు, కె రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి సుధాకర్

తరుగు దోపిడీ రూ.10 కోట్ల పైనే..!

- యాసంగి ధాన్యం సేకరణ పూర్తి చేసిన సర్కార్
- జిల్లాలోని 50వేల క్వింటాళ్ల వరకు తరుగు తీసిన వైనం



మోర్తాడ్: యాసంగి ధాన్యం సేకరణ పూర్తి కాగా తరుగు పేరుతో చేసిన దోపిడి మొత్తం విలువ రూ.10 కోట్లకు మించి పోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఒక విధంగా తరుగు తీయడంతో రైతుల సొమ్ముకు భారీగానే చిల్లులు పడ్డాయి. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 6.45 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యంను సేకరించారు. రైతుల నుంచి మాత్రం తూకం వేసిన ధాన్యం విలువ ఏడు లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా. సుమారు 55 వేల క్వింటాళ్ల ధాన్యం తరుగు కింద లెక్కకట్టి రైతులకు సొమ్ము చెల్లించలేదని తెలుస్తుంది. ఒక్కో క్వింటాలు ధాన్యంకు ఏ గ్రేడ్ ప్రకారం రూ.2,060 చొప్పున సొమ్ము చెల్లించారు. ఈ లెక్కన రూ.10 కోట్లకు మించి రైతుల నుంచి తరుగు పేరుతో తీసిన ధాన్యానికి సొమ్ము జమ కాలేదని వెల్లడైతుంది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 6 కిలోల నుంచి 8 కిలోల వరకు తరుగు తీశారు. సంచి బరువుకు ఒక కిలో తరుగును అధికారికంగానే తీసినా అనధికారికంగా తరుగు తీయడం పెంచుతూ పోయారు. రైతులు ఆందోళనలు చేపట్టినా తరుగు తీత యధాతథంగానే కొనసాగింది. నిబంధనల ప్రకారం ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు ట్రక్ షీట్‌లను జారీ చేయాలి. తరుగు తీయడం తప్పనిసరి కావడంతో రైతులకు ట్రక్ షీట్‌లను అసలే ఇవ్వలేదు. ఇది ఇలా ఉండగా గతంలో ఒక క్వింటాలుకు రెండు కిలోల తరుగు మాత్రమే తీసేవారు. నాలుగైదు ఏళ్ల నుంచి తరుగు పరిమాణం పెంచుతూ పోయారు. మంత్రులు సమీక్షా సమావేశాల్లో తరుగు తీయవద్దని పదే పదే చెప్పినా తరుగు దోపిడీ ఆగలేదు.

రైతులపైనే హమాలీ చార్జీల భారం

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన తరువాత హమాలీ కార్మికులకు చెల్లించే చార్జీలలో కొంత మొత్తాన్ని ప్రభుత్వం రైతులకు వాపసు చేసేది. నాలుగేళ్ల నుంచి హమాలీ చార్జీలను వాపసు చేయక పోవడంతో రైతులే ఈ చార్జీల భారం మోస్తున్నారు. అలాగే ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే ధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఆచరణలో మాత్రం ధాన్యం సొమ్మును సకాలంలో జమ చేయడం లేదు. ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కావడానికి నెల రోజుల నుంచి 45 రోజుల సమయం పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లలో చోటు చేసుకున్న భారీ అవినీతిపై విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



తరుగు దోపిడీపై ప్రభుత్వం స్పందించాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం సేకరణలో ప్రజాప్రతినిధులు, అధికారులు అందిన కాడికి దండుకుంటున్నారు. రూ.కోట్లలో సొమ్ము చేతులు మారుతుంది. కడ్తా దోపిడీలో అందరికి వాటాలు ఉన్నాయి కాబట్టే ఎవరూ నోరు మెదపడం లేదు.

– సుంకెట్ అన్వేష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్

పురస్కారం అందజేత



రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండకు చెందిన మఠం దీపక్ స్వామి ఆదివారం జాతీయ మహానంది పురస్కారం అందుకున్నారు. గుంటూరులోని చుట్టుగుంట పోలేరమ్మ దేవాలయంలో అవార్డు అందుకున్నారు. వాస్తు జ్యోతిష్య అర్చక పురోహిత రంగంలో విశేష సేవలు అందించినందుకు తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థ పురస్కారాన్ని అందజేశారు.

అపూర్వ సమ్మేళనం



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. 23 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు.

క్రైం కార్నర్

విద్యుత్ స్తంభంపై గుండెపోటు

కిందపడి రైతు మృతి



భూక్య భాస్కర్ (ఫైల్)

మాచారెడ్డి: వ్యవసాయ మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే ప్రయత్నంలో స్తంభంపైనే గుండెపోటు రావడంతో కింద పడి ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు.. మాచారెడ్డి మండలం కాకులగుట్ట తండాకు చెందిన బూక్య భాస్కర్ (37) వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. దీంతో మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి స్తంభం ఎక్కి సర్వీసు వైర్లు బిగిస్తుండగా గుండెపోటు వచ్చింది. దీంతో జారి కింద పడ్డాడు. స్తంభం వద్ద నరికిన మోదుగు చెట్టు కొమ్మపై పడడంతో అది కుచ్చుకుపోయి ప్రాణాపాయ స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో గల ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఈసీజీ తీసి, వైద్యం మొదలుపెట్టే లోపే ప్రాణాలు కోల్పోయాడు. గుండెపోటు రావడంతోనే చేతులు జారి పోయి కింద పడ్డాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సునీత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచారెడ్డి ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

కామారెడ్డిలో రెండిళ్లలో చోరీ



కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లలో ఆదివారం వేకువ జామున దొంగలు పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని ఏకే గార్డెన్ సమీపంలో కిరాణం దుకాణం నడిపించే శ్రీనివాస్ శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో దుకాణానికి తాళం వేసి వెనక భాగంలో ఉండే ఇంటికి వెళ్లిపోయాడు. తాళం పగల గొట్టి దుకాణంలోకి చొరబడిన దొంగలు గల్ల పెట్టెలోని రూ.4 వేలు ఎత్తుకెళ్లారు. అక్కడి నుంచి పక్కనే ఉన్న ఆకుల రవి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. రవి కుటుంబం దోమకొండ మండలం జనగామకు వెళ్లగా తాళం పగల గొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి 30 వేల నగదు తో పాటు 30 తులాల వెండి వస్తువులు రెండు గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం దొంగలు పడినట్లుగా గుర్తించి బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

లాభాల ఆశ చూపి రూ.15 వేలు టోకరా

కామారెడ్డి క్రైం: తమ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో చెల్లిస్తామని ఆశ చూపి ఓ వ్యక్తికి ఆన్‌లైన్ మోసగాళ్లు రూ.15 వేలకు టోకరా వేశారు. ఈ ఘటన కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జగ్గ ప్రదీప్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రూ.5 వేలు పెట్టుబడి పెడితే రూ.18 వేలు చెల్లిస్తామని ఈ నెల 20న ఆయనకు ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చూశాడు. వారు చెప్పిన విధంగా మొదట రూ.5 వేలు, ఆ తర్వాత రూ.10 వేలు చెల్లించాడు. తన డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి ఆదివారం దేవునిపల్లి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

అబ్జర్వర్, సీఎస్‌లను సస్పెండ్ చేయాలి



బోధన్‌టౌన్: బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో గంటన్నరకే పేపర్ తీసుకొని విద్యార్థులను బయటకు పంపిన అబ్జర్వర్, చీఫ్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని భారతీయ విద్యార్థి సేన ఎడపల్లి మండల అధ్యక్షుడు మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్‌లో ఆయన మాట్లాడారు. నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే పరీక్ష నిర్వహించాలని, లేని పక్షంలో విద్యార్థులను పాస్ చేయాలన్నారు. యోగేష్, విష్ణు, రాహుల్, వంశీ తదితరులు ఉన్నారు.